ఆదాయపు పన్ను చెల్లింపులో ఊరట

ఉమ్మడి జిల్లాలో 25 లక్షల మందికి మేలు

విజయవాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయపు పన్ను చెల్లింపు అంశం ఉమ్మడి జిల్లా వాసులకు భారీగా ఉపశమనం కలిగించింది. ఇప్పటి వరకు వచ్చిన ఆదాయాన్ని బట్టి పన్ను చెల్లించిన వేతన జీవులు, మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులు కొత్త విధానంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 30లక్షల మంది ఆదాయపు పన్ను పరిధిలో ఉన్నారు. వాళ్లంతా ప్రతి ఏడాది ఐటీ రిటర్న్ దాఖలు చేస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 25లక్షల మందికి మేలు కలుగుతోందని చార్టెడ్ అకౌంటెంట్లు అభిప్రాయపడుతున్నారు.

రిటర్న్ దాఖలు చేసి రిబేటు క్లెయిమ్ చేసుకోవాలి

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకారం రూ.12లక్షల లోపు ఆదాయం ఉంటే నిల్ ట్యాక్స్. రూ.4 లక్షల ఆదాయం ఉంటే ఐటీ రిటర్న్ దాఖలు చేయాల్సిన అవసరం లేదు. రూ.12లక్షలు ఆదాయం వస్తే రిటర్న్ దాఖలు చేసి రిబేటు క్లెయిమ్ చేసుకోవాలి. ఒకవేళ రిటర్న్ దాఖలు చేయకపోతే జరిమానా విధిస్తారు. ఇప్పటి వరకు ఆదాయపు పన్నులో రూ.25వేలు బెనిఫిట్ ఉంది. దాన్ని రూ.65వేలకు పెంచారు. రూ.0-4లక్షల ఆదాయం ఉంటే పన్ను నిల్. రూ.4-8లక్షల ఆదాయం ఉంటే ఐదు శాతం చెల్లించాలి. రూ.8-12లక్షలు ఆదాయం ఉంటే పది శాతం చెల్లించాలి. రిటర్న్ దాఖలు చేసి క్లెయిమ్ చేసుకోకపోతే రూ.5వేలు జరిమానా విధిస్తారు.

- సుబ్బారావు, చార్టెర్డ్ అకౌంట్

అన్ని వర్గాలకు మేలు చేసేలా బడ్జెట్



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉంది. రైతులకు మేలు చేసే ప్రధాన మంత్రి ధాన్య కల్యాణ యోజన రాష్ట్రాల భాగస్వామ్యంలో ఏర్పాటు చేసే ఆలోచన బాగుంది. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు పంట రుణాలు రూ.3లక్షల నుంచి 5లక్షల వరకు పెంచడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. జల్ జీవన్ మిషన్ పథకం పనులను పూర్తి చేయడానికి 2028 వరకు గడువు పెంచడం రాష్ట్రానికి మేలు చేస్తుంది.

-ఎంపీ వల్లభనేని బాలశౌరి

ఇది ప్రజలకు మేలుచేకూర్చే బడ్జెట్



వికసిత్ భారత్‌కు బాసటగా కేంద్రప్రభుత్వ బడ్జెట్ ఉంది. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఉద్యోగులకు వరం లాంటిది. వ్యవసాయ రంగం, గ్రీన్ ఎనర్జీ విషయంలో బడ్జెట్ కేటాయింపులు భవిష్యత్‌లో తోడ్పాటుగా ఉంటాయి. బడ్జెట్ కేటాయింపులలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. ఇది ప్రజలకు మేలు చేకూర్చే బడ్జెట్.

- కొల్లు రవీంద్ర, మంత్రి

జల్ జీవం

ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఊతమిచ్చిన కేంద్ర ఆర్థిక బడ్జెట్

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో శాశ్వత తాగునీటి పథకాల ఏర్పాటుకు దోహదం

జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని మంచినీటి ప్రాజెక్టులకు జీవం పోసింది. దాహార్తితో అల్లాడుతున్న ప్రజల గొంతు తడవనుంది. గత వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న జేజేఎం పనులను ముందుకు తీసుకువెళ్లడంతో పాటు సాగర్, పులిచింతల నుంచి ఎన్టీఆర్ జిల్లాకు, ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణాజిల్లాకు రక్షిత మంచినీటిని అందించేం దుకు అవకాశం ఏర్పడింది. ఈ క్రమంలో తలసరి నీటి వినియోగం పెంపు దిశగా అడుగులు పడనున్నాయి. కేంద్ర బడ్జెట్ చిరువ్యాపారులకు ఊతం, ఎంఎస్ఎంఈ రంగాలకు ప్రోత్సాహం, వేతన జీవులకు ఊరటనిచ్చింది. జీజీహెచ్, మచిలీపట్నం జనరల్ ఆస్పత్రికి డే కేర్ క్యాన్సర్ సెంటర్లు రాబోతుండటం శుభపరిణామం. కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- సాగర్, పులిచింతల నుంచి ఎన్టీఆర్ జిల్లాకు, ప్రకాశం బ్యారేజీ నుంచి మచిలీపట్నానికి తాగునీరు
- శాశ్వత ప్రాతిపదికన మంచినీటి ప్రాజెక్టులకు మోక్షం
- చిరువ్యాపారులకు ఊతం.. ఎంఎస్ఎంఈ రంగాలకు ప్రోత్సాహం
- విజయవాడ, మచిలీపట్నం జీజీహెచ్‌లకు డే కేర్ క్యాన్సర్ సెంటర్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని మరో మూడు సంవత్సరాలు కొనసాగించ నుండటంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో రక్షిత మంచినీటి పథకాల పరంపర కొనసాగనుంది. ఉమ్మడి జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద రూ.300 కోట్ల మేర పనులకు శ్రీకారం చుట్టగా, కేంద్రం 50 శాతం మేర మ్యాచింగ్ గ్రాంట్‌ను అందిస్తోంది. కిందటి వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని సర్వనాశనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో వైసీపీ ప్రభుత్వంలో పనుల్లో పురోగతి కొరవడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జల్ జీవన్ మిషన్ పనులకు సంబంధించి బ్యాలెన్స్ పనుల పురోగతిపై దృష్టి సారించడంతో పాటు కొత్త డీపీఆర్‌ల తయారీకి శ్రీకారం చుడుతున్న దశలో జేజేఎం పథకాన్ని పొడిగించడం ఉమ్మడి కృష్ణాజిల్లాకు వరంగా మారింది. కేంద్ర మ్యాచింగ్ గ్రాంట్ పనులకు సంబంధించిన జేజేఎంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో 1,540 పనులకు, కృష్ణాజిల్లాలో 1,620 పనులకు రూ.1200 కోట్ల వ్యయంతో డీపీఆర్‌లను తయారు చేశారు. తొలి దశలో ఎన్టీఆర్ జిల్లాలో 465 పనులకు రూ.150 కోట్ల వ్యయంతో, కృష్ణాజిల్లాలో 515 పనులకు రూ.170 కోట్లు కలిపి రూ.320 కోట్ల వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం రూ.68 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కృష్ణాజిల్లాలో రూ.70 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఎన్టీఆర్‌జిల్లా, కృష్ణాజిల్లాల చెంతనే కృష్ణానది ఉన్నా నూరు శాతం రక్షిత మంచినీటిని అందించలేని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనులను పట్టాలెక్కించేందుకు డీపీఆర్ రూపకల్పన దిశగా అడుగులు పడ్డాయి. ఎన్టీఆర్ జిల్లాకు సాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి నీటిని సంగ్రహించటం ద్వారా తలసరి నీటి వినియోగాన్ని పెంచాలని భావించి డీపీఆర్ తయారు చేస్తున్నారు. కృష్ణాజిల్లాకు ప్రకాశం బ్యారేజీ నుంచి మంచి నీటిని తీసుకువెళ్లేందుకు వీలుగా డీపీఆర్ రూపకల్పన దిశగా అడుగులు వేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో జల్‌జీవన్ మిషన్‌ను 2028 వరకు కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడం వల్ల ఉమ్మడి కృష్ణాజిల్లా వాసుల తాగునీటి అవసరాలు తీరడంతో పాటు, విస్తృతమైన వాటర్ నెట్‌వర్క్ ఏర్పడటానికి అవకాశాలు కలగనున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో పశ్చిమ ప్రాంతంలోని ఏ.కొండూరు, గంపలగూడెం మండలాల పరిధిలో కిడ్నీ బాధిత ప్రాంతాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే ప్రాజెక్టులకు అవకాశం ఏర్పడింది.

ఎంఎస్ఎంఈ రంగం ఖుషి

ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కరోనా తదనంతర పరిస్థితుల్లో ఎంఎస్ఎంఈలు మనుగడ సాధించాలంటే పెట్టుబడి అవసరమవుతోంది. పెట్టుబడి ప్రోత్సాహకాలను ఈ రంగం గత మూడేళ్లుగా కోరుతోంది. ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల మేరకు పెంపుదల చేయటంపై ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎంఎస్ఎంఈ రంగానికి చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రధానంగా ఐటీ స్టార్టప్స్ వంటివి గత కొన్నేళ్లుగా ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణాజిల్లాలో కమ్యూనికేషన్స్, తయారీ రంగాలకు చెందిన స్టార్టప్స్ ఎక్కువగా ఏర్పాటవుతున్నాయి. స్టార్టప్స్ కూడా రూ.10 కోట్ల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాల పెంపు పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

క్యాన్సర్ బాధితులకు ఊరట

జీవన విధానం మారడంతో రోజురోజుకు క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడం, ఖరీదైన పరీక్షలు చేయించుకోవాల్సి రావడం వల్ల ముందస్తుగా తెలుసుకునేప్రయత్నం ఎవరూ చేయడంలేదు. దీంతో ఎంతో మంది మూడు, నాలుగో స్టేజికి చేరుకునే వరకు తెలుసుకోలేక చనిపోతున్నారు. క్యాన్సర్ మహమ్మారిని జయించేందుకు అన్ని జిల్లా ఆస్పత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వటం వల్ల పేదలకు అందుబాటులోకి క్యాన్సర్ వైద్యం రాబోతోంది. విజయవాడలోని కొత్త ప్రభుత్వాస్పత్రిలో కానీ, కృష్ణాజిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో కానీ క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య సేవల విభాగాలు లేవు. కేంద్రం నిర్ణయం వల్ల రెండు జిల్లాల ఆస్పత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి.

మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్రం కొత్త ఆలోచన

మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులు చేయనట్టుగా కనిపిస్తున్నప్పటికీ.. ఈ సారి కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గతంలో కేటాయింపులు జరిపిన వాటికి సంబంధించి బడ్జెట్ వినియోగం జరగకపోవటం వల్ల అవి మురిగిపోతున్నాయి. ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ సారి అలా కాకుండా కేంద్ర ప్రభుత్వ ఆమోదిత ప్రాజెక్టులకు ఆటోమేటిక్‌గా బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిధులు కేటాయింపు ఆలోచనను కేంద్రం చేసినట్టుగా తెలుస్తోంది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు విషయానికి వస్తే.. ఈ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ ఆమోదించాల్సి ఉంది. అందువల్ల ప్రత్యేకంగా కేటాయింపులు జరపలేదు. గతంలో మెట్రో ప్రాజెక్టు కోసం కేటాయించిన కేటాయింపులు ఖర్చు కాకపోవటంతో అవి మురిగిపోయాయి.



మిర్చికేదీ మద్దతు..!

8



నేటినుంచి సుబ్రహ్మణ్యేశ్వరుని వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు

8

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి

» రాజకీయ పార్టీల నేతలతో కలెక్టర్ బాలాజీ

8

తీరంలో బుసక దందా!

మచిలీపట్నం మండలంలోని ముడా, ప్రభుత్వ భూముల్లో బుసకదందా యథేచ్ఛగా కొనసాగుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా బుసకను తవ్వి, తరలించుకుపోతున్నారు. మంగినపూడి బీచ్‌కి సమీపంలోని ఓ గ్రామంలో చోటా నాయకుడు ప్రభుత్వ భూముల నుంచి బుసకను తవ్వి విక్రయిచేస్తున్నాడు. స్థానికులు, అధికారులు అడ్డు చెబితే వారిపై బెదిరింపులకు దిగుతున్నాడు. కూటమి పాలకుల వద్ద తన మాటే చెల్లుబాటు అవుతుందని చెబుతూ తన అక్రమ బుసక వ్యాపారాన్ని మరింత విస్తరిస్తున్నాడు. ఈ చోటా నాయకుడి దందాతో కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని కూటమి స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముడా, ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు

రాత్రి, పగలు తేడాలేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రవాణా

- సముద్ర తీరం వెంబడి ఓ చోటా నాయకుడి అక్రమాలు
- కృత్తివెన్నులో 50 ఎకరాల భూమిలో సరుగుడు చెట్ల తొలగింపు
- బుసకదందాపై కూటమి పెద్దలకు ఫిర్యాదులు



గోపువానిపాలెం, మంగినపూడి గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా బుసకను తవ్విన ప్రాంతాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ప్రకృతి విపత్తులు సంభవించిన సమయం గ్రామాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకురాకుండా పెట్టని గోడలా ఉన్న ప్రభుత్వ భూముల నుంచి బుసకను బీచ్ సమీపంలోని ఒక గ్రామానికి చెందిన చోటా నాయకుడు, అతని అనుచరులు యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత ఐదు నెలలుగా బుసక దందా కొనసాగుతోంది. బుసక దోపిడీని చూసి కూటమి నాయకులు ముక్కున వేలేసు కుంటున్నారు. బుసకదందాను కొనసాగిస్తూనే మరో వైపు వివాదాస్పదంగా ఉన్న భూముల పంచాయతీలోనూ చోటా నాయకుడు జోక్యం చేసుకుని బెదిరింపులకు దిగడం గమనార్హం. వారం రోజుల కిందట మిగతా 8లో..

పొంచి ఉన్న ప్రమాదం

సముద్రానికి అత్యంత సమీపంలో గోపువానిపాలెం, మంగినపూడి, తపశిపూడి కరగ్రహారం తదితర గ్రామాలున్నాయి. తుపానులు సంభవించిన సమయంలో ఉప్పునీరు చొచ్చుకు రాకుండా సముద్రానికి, గ్రామాలకు మధ్య వేలాది ఎకరాల బే ఆఫ్ బెంగాల్ భూముల్లో, ప్రభుత్వ భూముల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన మెరక భూములు అడ్డుగా ఉంటాయి. ప్రస్తుతం ఈ భూముల నుంచి బుసకను తవ్వేస్తుండటంతో సముద్రంలో పెద్ద అలలు వచ్చినపుడు, తుపానులు సంభవించిన సమయంలో సముద్రపునీరు గ్రామాల్లోకి చొచ్చుకు వస్తుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ భూముల్లో బుసకను తవ్వి విక్రయిస్తుంటే జనసేన నాయకులు అడ్డుకున్నారని ఆయా గ్రామాల ప్రజలు గుర్తు చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల నుంచి గ్రామాలను కాపాడేందుకైనా సముద్రతీరం వెంబడి అక్రమ బుసక తవ్వకాలను నిలిపివేయాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాడు.. వైసీపీ నిర్వహించిన ప్లీనరీలో ఆయనో వలంటీర్. నేడు.. సివిల్ సప్లయిస్‌లో షాడోబాస్. వైసీపీ పోయి.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా ఈ అధికారిదే హవా. ఎన్నికలప్పుడు సహాయ ఎన్నికల అధికారిగా నగరంలోకి అడుగుపెట్టి.. ఇక్కడే మకాం వేసి.. సివిల్ సప్లయిస్‌లో అన్నీతానై వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారంగా తనిఖీలు, డీలర్ల ఎంపికలో అవకతవకలకు పాల్పడటమే కాదు.. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి (డీఎస్‌వో)ను కూడా శాసిస్తున్న స్థాయికి ఈయన వెళ్లినా చర్యలు తీసుకునే పరిస్థితి లేదు.

సివిల్ సప్లయిస్‌లో.. షాడో బాస్



వివాదాస్పద నిర్ణయాలతో అందరిపై పెత్తనం

రేషన్ డీలర్ల నియామకాల్లో గోల్‌మాల్

- ఆర్డీవో పేరు చెబుతూ పరిధిలేని చోట తనిఖీలు
- ఉన్నతాధికారిని ఖాతరు చేయకుండా నిర్ణయాలు
- వైసీపీకి వీరవిధేయుడు.. ప్లీనరీలో వలంటీర్ సేవలు
- ఎన్నికల ముందు నగరానికి వచ్చి.. ఇక్కడే మకాం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లా సివిల్ సప్లయిస్ శాఖలో వన్‌మ్యాన్ షో నడుస్తోంది. దీనికి ఆ శాఖలోని ఓ సహాయ అధికారి అత్యుత్సాహమే కారణం. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి (డీఎస్‌వో)నే కాదని ఈయన తీసుకుంటున్న నిర్ణయాలు అందరికీ ఇబ్బందిగా మారాయి. జిల్లా రెవెన్యూ అధికారులతో ఉన్న పరిచయాలతో ఆ శాఖను శాసించే స్థాయికి వచ్చారు. చివరికి అందరిపై పెత్తనం చేసేవరకు వెళ్లారు.

డీలర్ల నియామకాల్లో అవినీతి

విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన రేషన్ డీలర్ల నియామకాల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడ్డారన్న ఫిర్యాదులు వచ్చాయి. డీలర్ల పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షల మిగతా 8లో..

మిర్చికేదీ మద్దతు!

గిట్టుబాటు ధర లేక మిర్చి రైతుల విలవిల కేజీ రూ.10 కంటే దిగువకు పడిన ధర

ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు వేడుకోలు



ఆత్మహత్యలే శరణ్యం: పుప్పాల సతీష్

ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా మిర్చి పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం వెంటనే గిట్టుబాటు ధర చెల్లించి ఆదుకోవాలి. లేకపోతే ఆత్మహత్యలే శరణ్యం.



ప్రభుత్వం కొనుగోలు చేయాలి.. లుక్కా కృష్ణారావు, కౌలు రైతు

కూరగాయల పంటలకు మోపిదేవి మండలం ఎన్నో దశాబ్దాలుగా లంక గ్రామాలు ప్రసిద్ధిగాంచాయి. కృష్ణానది వరదల కారణంగా బజ్జీ మిర్చి సాగు అధికంగా చేస్తున్నారు. నేరుగా రైతులు మార్కెట్‌కు తరలిస్తుండగా, రూ.10 కూడా చెల్లించటం లేదు. ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర చెల్లించేలా ఏర్పాట్లు చేయాలి.



రైతులను ఆదుకోవాలి మత్తి సత్యనారాయణ, కౌలు రైతు

బజ్జీ మిర్చి సాగు చేస్తున్న రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. కూలీల ధర కూడా చెల్లించలేని పరిస్థితిలో రైతులున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలి.



రవాణాకు సిద్ధంగా ఉన్న మిర్చిని చూపుతున్న రైతులు

ఆంధ్రజ్యోతి-మోపిదేవి: వాణిజ్య, కూరగాయల పంటలకు దివిసీమ ప్రాంతంలోనే ప్రసిద్ధిగాంచినవి మోపిదేవి మండలంలోని లంక గ్రామాలు. అక్కడ సాగు చేస్తున్న బజ్జీ పచ్చిమిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల్లాడుతున్నారు. లంక గ్రామాలైన మోపిదేవిలంక, నాగాయితిప్ప, కోసూరువారిపాలెం, మోపిదేవి వార్పు, కొక్కిలిగడ్డ గ్రామాల్లో 2500 పైగా ఎకరాల్లో ప్రస్తుతం బజ్జీ మిర్చి పంటసాగు చేస్తున్నారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో కృష్ణానదికి వరదలు సంభవించగా, వందల ఎకరాల్లో సాగుచేసిన వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదల అనంతరం రూ.లక్షల్లో ఆర్థికంగా నష్టపోయిన రైతులు నష్టాలను అధిగమించాలన్న ఉద్దేశంతో బజ్జీ మిర్చి పంటను సాగుచేశారు. మీనం రకపు మిర్చి పంటను సాగు చేయగా ప్రస్తుతం పంట ఏపుగా పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం రైతులకు గిట్టుబాటు ధర రూపంలో దెబ్బకొట్టడంతో వారు విలవిల్లాడుతున్నారు. కేజీ రూ.10కి కూడా ధర రావటం లేదు. కనీసం కూలీ ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాలకు ఎక్కువగా రవాణా చేస్తుండగా, ఇటీవల వారం నుంచి నాగపూర్ వంటి నగరాలకు సైతం మిర్చి పంట రవాణా సాగుతుంది. ఇతర ప్రాంతాలకు రవాణా సాగుతున్నప్పటికీ వ్యాపారస్థులు రైతులకు ధర చెల్లించటంలో మాత్రం రూ.10 మించి చెల్లించే ప్రసక్తి లేదని చెబుతున్నారు. ఎకరాకు కౌలు రూ.50 వేలు, పెట్టుబడి రూ.1.20 లక్షలు చెల్లిస్తుండగా ప్రస్తుతం రూ. 10కి అమ్మితే నష్టాల పాలు కావాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రోజూ 2500 పైగా బస్తాలు మిర్చి పంట మోపిదేవి మండలం నుంచి ఇతర నగర ప్రాంతాలకు రవాణా చేస్తుండగా, ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.



మిర్చి పంటను కోస్తున్న కూలీలు

సుబ్రహ్మణ్యేశ్వరుని బ్రహ్మోత్సవాలు నేటి నుంచి



ఆంధ్రజ్యోతి-మోపిదేవి: రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు 2 నుంచి ప్రారంభం కానున్నాయి. మోహినీపురం.. అనంతరం కాలంలో మోపిదేవిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో స్వామివారు సర్పరూపంలో ఉండటంతో సర్పక్షేత్రంగానూ ప్రసిద్ధి గాంచింది. లింగ రూపంలో ఉండటంతో కుమార క్షేత్రమని మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రసిద్ధిగాంచింది. మాఘమాసంలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలివే..

2న మాఘశుద్ధ చవితి ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీ స్వామిని పెండ్లి కుమారుడిని చేయటంతో ఈ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 3న సోమవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాల్సాన, పంచామృతస్నపన, నిత్యహోమాలు జరుగుతాయి. మధ్యాహ్నం 2 గంటలకు స్వామిని శేషవాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 8 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుంది. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లకు నందివాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 4న ఉదయం స్వామికి నిత్య పూజలు, రాత్రి 8 గంటలకు స్వామి రథోత్సవం వైభవంగా జరుగుతుంది. 5న ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, అవభృత స్నానోత్సవం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాల దీక్షా విరమణ, మహాపూర్ణాహుతి జరుగుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు వేదవిద్వత్ సభ, పండిత సత్కారం, రాత్రి 7 గంటలకు శమీ వృక్ష పూజ, 8 గంటలకు మయూర వాహనంపై గ్రామోత్సవం రావివారిపాలెం వరకు జరుగుతాయి. 6న గురువారం ఉదయం 10 గంటలకు శ్రీ సుబ్రహ్మణ్యహవనం, రాత్రి 8 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, 9 గంటలకు పవళింపు సేవ జరుగుతాయి.



స్వామి తెప్పోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

ప్రత్యేక ఆకర్షణగా తెప్పోత్సవం

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది నూతనంగా దేవస్థానం సమీపంలోని కోనేరు పుష్కరిణి నందు తెప్పోత్సవం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నూతనంగా ప్రారంభం కానున్న ఈ తెప్పోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద్ ఆధ్వర్యంలో దేవస్థానంలో విద్యుత్ దీపాలు, చాందినీ టెంట్లతో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు.

తెప్పోత్సవం ఏర్పాట్ల పరిశీలన

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పోత్సవ ఏర్పాట్లను చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణలు అధికారులతో కలిసి పరిశీలించారు. 6న సాయంత్రం నిర్వహించే తెప్పోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు మెరుగుపడాలి

● వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా

పెనమలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పేర్కొన్నారు. శనివారం పెనమలూరు ఉన్నత పాఠశాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనరు విజయరామరాజు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. రాజీవ్‌రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని చిన్నారులకు విద్యతోపాటు తమకిష్టమైన రంగంలో రాణించేలా, ప్రపంచ యవనికపై సత్తా చాటేలా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం విద్యాశాఖ కమిషనర్ అభ్యసన అంతరాలను అధిగమించడానికి చేపడుతున్న ప్రణాళికలను వివరించారు. పరీక్షల విభాగం డైరెక్టర్ కే శ్రీనివాసులురెడ్డి, పాఠశాల టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ డీ మధుసూదన్, డీఈవో పీవీజే రామారావు, డిప్యూటీ ఈవో ఐ పద్మరాణి, ఎస్ఎంసీ చైర్మన్ కైరున్ బీ, ఎంఈవో శేష గిరిరావు, హెచ్ఎం భవానీ పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను కృష్ణా ఎస్పీ ఆర్ గంగాధరరావు మంగళగిరిలోని ఏపీ పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తీరంలో బుసక దందా!

(7వ పేజీ తరువాయి)

కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెంలోని వివాదంలో ఉన్న భూమిని గన్నవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో తనకు అనుకూలమైన వారి పేరున 50 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించినట్లు సమాచారం. రెండు రోజులుగా ఈ భూమిలో ఉన్న సరుగుడు చెట్లను ఈ చోటా నాయకుడి కనుసన్నల్లో నరికివేస్తున్నారు. మచిలీపట్నంలోని బలరామునిపేట, తదితర ప్రాంతాలకు చెందిన 150 మందికిపైగా యువకులను అక్కడకు తీసుకువెళ్లి సరుగుడుతోట వద్ద ఉంచి తనదందాను కొనసాగిస్తుండటంతో మచిలీపట్నం మండలంలోనే కాదు, కృత్తివెన్ను మండలంలోనూ ఈ చోటా నాయకుడు దందాకు తెరలేపాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు భూమి యజమాని రెవెన్యూ, పోలీస్ అధికారులుకు తెలియజేసినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

బుసక తరలింపుపై కలెక్టర్‌కు ముడా చైర్మన్ లేఖ

మచిలీపట్నం మండలం గోపువానిపాలెం, కరగ్రహారం, తపసిపూడి తదితర గ్రామాల్లో పోర్టు నిర్మాణం కోసం మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కు గతంలో ఎకరం రూ.25 లక్షల చొప్పున రైతులు విక్రయించారు. ఈ భూములు ఎక్కడున్నాయో ముడా కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలోని సర్వేయర్‌ల ద్వారా తెలుసుకుని ఆ భూముల నుంచి బుసకను తవ్వేస్తున్నారు. ముడా భూముల నుంచి బుసక తవ్వేస్తున్నారని వెంటనే నిలిపివేయాలని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ ఇటీవల కలెక్టర్‌కు లేఖ కూడా రాశారు. పోర్టు నిర్మాణం జరిగితే పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల ఏర్పాటుకు కొందరు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. ఇటీవల కలెక్టర్ పరిశ్రమలశాఖ, ముడా అధికారులతో సమావేశం నిర్వహించి ముడా ఆధీనంలో ఉన్న భూములలో పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముడా భూముల్లో బుసకను తరలించి పెద్దగోతులు తవ్వుతుండటంతో ఆ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతమేర ముందుకు వస్తారనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

సివిల్ సప్లయిస్‌లో.. షాడో బాస్

(7వ పేజీ తరువాయి)

తర్వాత ఎంతమంది అభ్యర్థులు పాల్గొన్నారు? వారికి వచ్చిన మార్కులేంటి? అనే వివరాలు బయట పెట్టకుండా ఉండటం వెనుక ఈయన హస్తమే ఉందని తెలుస్తోంది. కేవలం మొదటి ఐదుగురి పేర్లనే వెల్లడించారు. ఆ తర్వాత.. ఇంటర్వ్యూల పేరుతో మరో కథ నడిపించారు. ఈ సమయంలో ఏకంగా పోస్టులను అమ్మేశారన్న ఆరోపణలు ఈయనపై వచ్చాయి. ఇందుకు పలు నిదర్శనాలు కూడా ఉన్నాయి. నగరం బయట స్వయం సహాయ సంఘం తరఫున చౌక దుకాణం నడిపిన మహిళకు విజయవాడలో రేషన్ షాపును కేటాయించటం గమనార్హం. ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవటం ఈ షాడోబాస్‌కే చెల్లుతుంది.

ఎంపికలో అన్యాయం

మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం పరిధిలో రేషన్ డీలర్ల ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందన్న విమర్శలు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లోని అధికార పార్టీ నాయకులు సైతం షాడోబాస్‌పై గుర్రుగా ఉన్నారు. తాము సిఫార్సు చేసిన వారికి కాకుండా, వేరే వారికి షాపులు రావడం వెనుక షాడో బాస్ హస్తం ఉందని భావిస్తున్నారు. అలాగే, గత ఆగస్టులో బుడమేరుకు భారీ వరద వచ్చిన సంగతి తెలిసిందే. వరదలకు రేషన్ డిపోల్లో నిత్యావసరాలు తడిచిన విషయాన్ని అడ్డు పెట్టుకుని.. తప్పుడు నివేదికలు కూడా ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా చేసినందుకు వాటాలు ఇచ్చుకున్నామని కూడా పలువురు డీలర్లు పేర్కొన్నారు.

వైసీపీ హయాం నుంచీ..

వైసీపీ హయాంలో ఈ షాడోబాస్ గుంటూరులో పనిచేసేవారు. స్థానికంగా జరిగిన వైసీపీ ప్లీనరీలో వలంటీర్‌గా సేవలందించారు. ఎన్నికల వేళ విజయవాడ వచ్చారు. వచ్చీ రాగానే ఇక్కడ సహాయ ఎన్నికల అధికారిగా పనిచేశారు. కూటమిలోని ఓ భాగస్వామ్యపక్ష ఎమ్మెల్యే ప్రాపకం సంపాదించి ఇక్కడే మకాం వేశారు. సివిల్ సప్లయిస్‌లో తాను చెప్పినట్టే నడవాలన్న పరిస్థితిని తీసుకొచ్చారు. ప్రతిచోటా విజయవాడ ఆర్డీవో పేరును ఉపయోగిస్తున్నారు. ఆయన చెప్పారంటూ.. తన పరిధి కాకపోయినా ఇతర మండలాల్లోని పెట్రోల్, డీజిల్ బంకులు, రేషన్ డిపోలు, రైస్ మిల్లుల్లో తనిఖీలకు వెళ్తున్నారు. షాడోబాస్ ఆగడాలపై కలెక్టర్ దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో మరిన్ని విపరీత పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఉంది.

బడ్జెట్ కేటాయింపులు హర్షణీయం: గద్దె



పటమట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్టు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డే కేన్సర్ సెంటర్లు ఏర్పాటు, వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 75వేల కొత్త మెడికల్ సీట్లు, అటల్ టింకరింగ్ ఏర్పాటు, పప్పుధాన్యాల ఉత్పత్తికి స్వయం సహాయ పథకం, దేశంలో వ్యవసాయాన్ని పోత్సహించేలా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. అన్ని రంగాలకు సమ ప్రాధాన్యతనిచ్చారన్నారు.

మధ్య తరగతి ప్రజలకు అనుకూలం: బూరగడ్డ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద ప్రజలకే కాకుండా మధ్య తరగతి ప్రజలకు అన్ని విధాల అనుకూలంగా ఉందని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. పోలవరం నిర్మాణానికి రూ.3వేల కోట్లు కేటాయింపు ముదావహమన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.5లక్షలకు పెంచడం, రూ.12లక్షల ఆదాయం ఉన్నవారికి ఆదాయపు పన్ను మినహాయించడం అభినందనీయమన్నారు.

75 వేల మెడికల్ సీట్లు కేటాయింపు ముదావహం : లంకిశెట్టి



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 75 వేల మెడికల్ సీట్లు కేటాయించి వైద్య విద్యకు తగిన ప్రాధాన్యత ఇచ్చిందని ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామీణాభివృద్ధికి రూ.26,6817 కోట్లు కేటాయిచడంతో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. వ్యవసాయ రంగానికి రూ.17,1437 కోట్లు కేటాయించడం వల్ల రైతులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. న్యాయశాఖకు ఎక్కువ నిధులు కేటాయిస్తే బాగుండేదన్నారు.

ఆలపాటికి అఖండ మెజార్టీని అందిద్దాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేసి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వెలవడటంతో కూటమి పార్టీల శ్రేణులు, వార్డు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో సమన్వయంతో ఎలా పనిచేశారో అదే రీతిలో పని చేసి ఆలపాటికి అఖండ మెజార్టీని తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఫిబ్రవరి 27న పోలింగ్ దృష్ట్యా ప్రతి పట్టభద్ర ఓటరును కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటికి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏ ఎన్నికలు వచ్చినా కూటమి అభ్యర్థులు గెలిచినప్పుడే సుస్థిర పాలన సాధ్యమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పట్టభద్రులకు వివరించాలన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహాయ,సహకారాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్, అమరావతికి ఆర్థిక సాయం, పోలవరానికి నిధులు, రైల్వేజోన్‌తో పాటు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రూ.7లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, దీంతో 4 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు దక్కనున్నాయన్నారు. ఆలపాటికి ఓటు వేసి ఎమ్మెల్సీగా అఖండ విజయాన్ని అందించాలని కోటేశ్వరరావు కోరారు. అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ సూరే గాంధీ, గుడివాడ ఇన్‌చార్జ్ దావులూరి సురేంద్రబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సాయన పుష్పావతి, టీడీపీ నేతలు దింట్యాల రాంబాబు, మురళీ, దానేటి సన్యాసిరావు, జనసేన నేతలు సందు పవన్, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి

● రాజకీయ పార్టీల నేతల సమావేశంలో కలెక్టర్ బాలాజీ



రాజకీయల పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయపార్టీల నేతలు సహకరించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబరులో కలెక్టర్ వివిధ రాజకీయపార్టీల నేతలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను జారీ చేస్తామన్నారు. ఈ నెల 10వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 13వరకు ఉపసంహరణకు గడువు ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి పురుష ఓటర్లు 35,343 మంది, మహిళా ఓటర్లు 27,796 మంది ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. గుడివాడ డివిజన్‌లో 23, మచిలీపట్నం డివిజన్‌లో 28, ఉయ్యూరు డివిజన్ 25 పోలింగ్ కేంద్రాలున్నట్టు తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని రాజకీయపక్షాల నేతలు తెలిపారు. డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, గుడివాడ, మచిలీపట్నం ఆర్డీవోలు సుబ్రహ్మణ్యం, కే స్వాతి, పార్టీల ప్రతినిధులు పంతం గజేంద్రరావు, షేక్ సలార్‌దాదా, అబ్దుల్ మతీన్, కొడాలి శర్మ ఎస్ బాలాజీ పాల్గొన్నారు.



ఎంఏ షరీఫ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు

వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవాలి

● ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర కమిటీ

పెనమలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను కబ్జాదారుల వద్ద నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో భాగంగా కృష్ణాజిల్లా తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లోని 79, 173, 176 సర్వే నంబర్లలోని 30 ఎకరాలు, సర్వే నంబరు 87లోని సుమారు 13 ఎకరాల భూమిని కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. కొన్నేళ్లుగా వక్ఫ్ భూములను ఆక్రమించి ఆదాయానికి గండి కొడుతూ పేద ముస్లింల కడుపు కొడుతున్న స్థానిక ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. దీంతో ఆయన వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ అహమద్, హాజీఅబ్దుల్ కలాం, రహీం ఖాన్, అబ్దుల్ అజీజ్, సర్దార్‌ఖాన్, హుస్సేన్, నాగూర్‌వలి, సద్దాం పాల్గొన్నారు.



నగల కోసం బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు

నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తాం: ఎస్పీ

● కొనసాగుతున్న ఖాతాదారుల ఆందోళన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కర్ణాటక బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ జి. సోమశేఖరరావు ఖాతాదారులు తాకట్టు పెట్టుకున్న బంగారం కొట్టేసి రోల్డుగోల్డు నగలు పెట్టిన సంగతి నగరంలో సంచలనం రేకెత్తించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై ఖాతాదారులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. తమ నగలు లాకరులో ఉన్నాయో లేవో తేల్చి చెప్పాలని చీఫ్ మేనేజర్ రాఘవేంద్రప్రసాద్‌ను ఖాతాదారులు నిలదీశారు. లాకర్‌లోని బంగారు నగలను ఖాతాదారులకు చూపించారు. కాగా రాఘవేంద్రప్రసాద్ ఒక దశలో ఏమీ చెప్పలేకపోయారు. అయితే ఎవరికి అన్యాయం జరగదని, నిందితుడి నుంచి నగలు రికవరీ చేసి ఎవరి నగలు వారికిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన కొంతవరకు సద్దుమణిగింది. కాగా జిల్లా ఎస్పీ గంగాధరరావు మీడియాతో మాట్లాడుతూ నిందితుడు బ్యాంకులో దొంగిలించిన బంగారాన్ని వేరే బ్యాంకుల్లో కుదువపెట్టి డబ్బు తీసుకున్నట్టు తెలిసిందన్నారు. అయితే నిందితుడు దొంగిలించిన రూ.కోటి 60 లక్షల బంగారం రికవరీపై పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకుంటాం..

కంకిపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా లే అవుట్ వేస్తే చర్యలు తీసుకుంటామని సీఆర్డీఏ ఉయ్యూరు జోనల్ డిప్యూటీ డైరెక్టర్ వరహాల బాబు అన్నారు. మండలంలోని పునాదిపాడు, ప్రొద్దుటూరు గ్రామాల్లో అక్రమ లే అవుట్లలో శనివారం రోడ్లు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేకుండా వేసిన లే అవుట్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. అయినా స్పందించిక పోవడంతో లే అవుట్‌లోని రోడ్లను ఎక్స్‌కవేటర్ సాయంతో ధ్వంసం చేశారు.





ఎల్వోసీ పత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

వైద్యానికి సీఎం సాయం

పెనమలూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు గ్రామానికి చెందిన కలపాల పెదభూషణం అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా, అతని వైద్యఖర్చుల నిమిత్తం ఎనభైవేల ఎల్వోసీ మంజూరయింది. ఎల్వోసీని శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, కొమ్మినేని వెంకటేష్, బొంగరాల అబ్రహాం, సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంక టరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎస్సీ కాలనీ ఉపాధ్యాయ నగర్, చర్చ్ రోడ్డు, రాయ్ నగర్, రామ్‌నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, రెవెన్యూ ఆఫీస్, గాంధీబొమ్మ సెంటర్, బుద్ధవరం రోడ్డు, గౌడపేట, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, వీనస్ బజార్, చెంచుల కాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు ప్రాంతాలలో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సమీర

100 మందికి వైద్యపరీక్షలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : హోప్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ముదునూరులో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 100 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని సర్పంచ్ మొవ్వ వెంకటనాగలక్ష్మి ప్రారంభించారు. జనరల్ ఫిజిషియన్ రాకేశ్, గైనకాలజిస్ట్ సమీర ఇతర వైద్య సిబ్బంది పాల్గొని శిబిరానికి వచ్చిన వారికి వైద్యపరీక్షలు చేశారు. టీడీపీ నాయకుడు మొవ్వ జ్ఞానశేఖర్, హాస్పిటల్ సిబ్బంది సేవలందించారు.



వేగ నియంత్రణ బోర్డును ఏర్పాటు చేస్తున్న అప్పనవీడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

వేగ నియంత్రణ బోర్డుల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు వచ్చే విద్యార్థులు వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులో అప్పనవీడు జడ్పీ హైస్కూల్ వద్ద వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి మొవ్వా రమేశ్ రంగ లక్ష్మీ దంపతులు అందించిన రూ.15వేలు విరాళంతో వేగ నియంత్రణ సూచిక బోర్డులు తయారు చేయించారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు,హెచ్‌ఎం తోట పుష్పావతి ప్రారంభించారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో వైసీపీ టౌన్ అధ్యక్షుడితో సహా వంద మందికి పైగా టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో టౌన్ పార్టీ ఆధ్వర్యంలో గన్నవరం ఎస్సీ కాలనీకి చెందిన 110 మంది వైసీపీ నుంచి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న తిరివీధి రంగారావు రాజీనామా చేసి శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గన్నవరం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు. రంగారావు రాకతో గన్నవరం టౌన్‌లోని ఎస్సీ కాలనీలో మెజారిటీ పెరిగే అవ కాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. టీడీపీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, ఎంపీటీసీ పడమట రంగారావు, పి. దేవకుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

హనుమాన్‌జంక్షన్ : కార్యకర్తలకు పార్టీతో పాటు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేసి పలువురిని పరామర్శించారు. అందులో భాగంగా బాపులపాడులో ఇటీవల గ్రామ టీడీపీ నాయకుడు యార్లగడ్డ సత్యనారాయణ కుమార్తె కొల్లిపర సంధ్య మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని యార్లగడ్డ పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీనివాసరావు, మూల్పూరి సాయి కల్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ, వీరమాచనేని సత్యప్రసాద్, ఆంజనేయులు, యలమంచిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

● యుద్ధప్రాతిపదికన ఫ్లెక్సీల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



విద్యుత్ స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీలు క్రేన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

ఉయ్యూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ, మండల పరిధి గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసిన రాజకీయ నాయ కుల ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగింపు చర్యలు చేపట్టారు. ఉయ్యూరులో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్ల వెంబడి విద్యుత్ స్తంభాలు, బాదులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా కట్టిన ఫ్లెక్సీలు, కటౌట్లు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ వాటిని తొలగించేందుకు అధికారులు వెనుకాడుతున్న వైనాన్ని 'అధికారుల అలసత్వం' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఉయ్యూరులో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు పైభాగాన కట్టిన ఫ్లెక్సీల తొలగింపునకు నగరపంచాయతీ కమిషనర్ క్రేన్ ఏర్పాటు చేయడంతో తొలగింపు ప్రక్రియ వేగవంతంగా పూర్తయ్యింది.



ప్రభుత్వ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

వీరమ్మ తిరునాళ్ల ప్రశాంతంగా జరగాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో ఈ నెల 8న ప్రారంభమై పదిహేను రోజులపాటు అత్యంత వేడుకగా జరిగే వీరమ్మ తిరునాళ్ల ఏవిధమైన అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసేలా అందరు సహకరించాలని తహసీల్దార్ ఎం సురేశ్‌కుమార్ కోరారు. తిరునాళ్ల ఏర్పాట్లు, తీసుకోవాలిసిన చర్యలపై ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఆలయ కమిటీతో శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలుసూచనలు చేశారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీకి, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పోలీస్ శాఖకు, పారిశుధ్యం, ఇతర వసతులపై నగరపంచాయతీ కమిషనర్, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసాద్, నగరపంచాయతీ కమిషనర్ పి వెంకటేశ్వరరావు, పట్టణ, రూరల్ ఎస్సైలు విశ్వనాథ్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.



గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో స్కూల్ కమిటీ చైర్మన్ అజ్గర్ షరీఫ్, హెచ్ సుధారాణి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కంకిపాడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కంకిపాడు జెడ్పీ పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్ అజ్గర్ షరీఫ్ అన్నారు. ఉయ్యూరు మండలం ఆకునూరులో జరిగిన 84వ గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అజ్గర్ షరీఫ్ మాట్లాడుతూ, క్రీడల ద్వారా మానసిక దృఢత్వంతో పాటు శారీరకంగా విద్యార్థులు బలపడతారని తెలియజేశారు. అనంతరం సీనియర్ కబడ్డీ, సాఫ్ట్‌బాల్ విభాగాల్లో ప్రథమ స్థానం, జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం సుధారాణి, పీడీ లకనం దుర్గా ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కలిసి కల్యాణ మండపం నిధుల విషయంపై వివరిస్తున్న ఆలయ ఈవో తారకేశ్వరరావు

కల్యాణ మండపానికి నిధులు ఇప్పించండి

ఎమ్మెల్యే చింతమనేనిని కోరిన అభయాంజనేయస్వామి ఆలయ ఈవో

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అభయాంజనేయస్వామి ఆలయప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మించడానికి ఎంపీ నిధులు మంజూరునకు కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఆలయ ఈవో తారకేశ్వరరావు కోరారు. శనివారం ఎమ్మెల్యేను ఆలయ అర్చకులతో ఏలూరు వెళ్లి ఆయన నివాసంలో కలిశారు. గతంలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చి ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కల్యాణ మండపం నిర్మాణానికి దాదాపు కోటి రూపాయలు అంచనా వ్యయం అవుతుందని త్వరితగతిన నిధులు మంజూరుకు చొరవ తీసుకొని చర్యలు చేపట్టాలని కోరినట్లు ఈవో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును ప్రారంభించడానికి తేదీని నిర్ణయించాలని కోరినట్లు తెలిపారు. కల్యాణ మండపం నిధులపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామాచార్యులు, రామాచార్యులు ఉన్నారు.



వెండి గద బహూకరిస్తున్న కుటుంబరావు

అభయాంజనేయ స్వామికి వెండి గద బహూకరణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కాటూరురోడ్డు హనుమాన్‌నగర్‌లో అభయాంజనేయస్వామి ఆలయానికి అమృత మెస్ అండ్ క్యాటరర్స్ అధినేత మెరుగుమాల కుటుంబరావు రూ. 40వేలు విలువ చేసే వెండి గద శనివారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మరీదు శ్రీనివాసరావు, వీరంకి శివనాగేశ్వరరావు, యార్లగడ్డ ఈశ్వరరావు, ఆరేపల్లి నాగరాజు, హరిబాబు తదితరులు పాల్గొని కుటుంబరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నిరాశ్రయులకు రెడ్‌క్రాస్ వితరణ

కూచిపూడి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోసూరులో శుక్రవారం ఏడు గృహాలు దగ్ధం కాగా, 10 మంది నిరాశ్రయులయ్యారు. బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ సంస్థ టార్పాలిన్లు, వంట పాత్రలు, రగ్గులు అందజేశారు. కూచిపూడి రోటరీక్లబ్ శాఖ దుప్పట్లు పంపిణీ చేసింది. తహసీల్దార్ కె.మస్తాన్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, జిల్లా ట్రెజరర్ కొండపల్లి బాలాజీ, మండల చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు దోనేపూడి శివరామయ్య, మద్దాల కోటేశ్వరరావు, రోటరీ ప్రతినిధు లు కోనేరు మంజునాథ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

కేంద్రబడ్జెట్‌తో వేతన జీవులకు ఊరట

ఉయ్యూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు ఎంతో ఊరటనిస్తుందని ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విశ్వనాథ్ అన్నారు. కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ కేంద్ర ఆర్థికమంత్రి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ మాజీ ప్రధాని మొరార్జీదేశాయ్ నెలకొల్పిన 10బడ్జెట్‌ల రికార్డుకు చేరువైందన్నారు. రైతుల కోసం కిసాన్ క్రెడిట్ కార్డు లోన్ రూ.3నుంచి రూ. 5లక్షలకు పెంచి, అధిక దిగుబడి విత్తనాలకోసం ప్రత్యేక ప్రణాళిక ప్రవేశపెట్టడం వ్యవసాయరంగానికి లబ్ధి చేకూరుతుందన్నారు. 100 గ్రామాల్లో పీఎం ధనధాన్య కృషి యోజన పథకం వల్ల 1.7 కోట్లమంది రైతులు ప్రయోజనం పొందుతారని కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ అభిప్రాయ పడ్డారు. వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు శేఖర్‌బాబు, జి కిరణ్‌కుమార్, కె స్వర్ణలత పాల్గొన్నారు.




మహిళ పాడిరైతును సత్కరిస్తున్న విజయ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పాడిరైతుల సంక్షేమమే లక్ష్యం

● విజయ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : అత్యధిక పాల సేకరణధర చెల్లిస్తూ ఆర్థికాభివృద్ధికి చేయూత నందిచడంతో పాటు సంక్షేమ పథకాలతో పాడిరైతు కుటుంబాలకు అండగా నిలవడమే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యమని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కోడూరుపాడు పాల సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రెండు తరాలకు చెందిన పాడిరైతులతో కలిసి వజ్రోత్సవ వేడుకల కేక్ కట్ చేశారు. పాలసేకరణ, ఉత్పత్తి తదితర విషయాలపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షుడు కళ్లే వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు, సూపర్‌వైజర్లు, వెటర్నరీ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.



సమిష్టి దివ్య బలిపూజ సమర్పిస్తున్న విజయవాడ మేత్రాసన పీఠాధిపతి తెలగతోటి రాజారావు

బాలయేసు దీవెనలతో శాంతి వెల్లివిరియాలి

● విజయవాడ మేత్రాసన పీఠాధిపతి తెలగతోటి రాజారావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజానికి శాంతి, ప్రేమ అవసరమని బాలయేసు దీవెనలతోనే అవి సాధ్య మని విజయవాడ మేత్రాసన పీఠాధిపతి తెలగతోటి రాజారావు అన్నారు. పెరికీడు జ్యోతినగర్ చర్చిలో బాలయేసు తిరునాళ్ల మహోత్సవాల రెండవ రోజు శనివారం ఆయన పాల్గొని సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. తెలుగు రాష్ట్రాల్లోని తెలంగాణాలో ఏంజెలా బాలయేసు, ఆంధ్రప్రదేశ్‌లోని జ్యోతినగర్‌లో కొలువైన అద్భుత బాలయేసును భక్తుల విశ్వాసాలను, నమ్మికను బలపరుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విచారణ ఫాదర్ చేబ్రోలు జోసఫ్‌తంబి, ఫాదర్ వినోద్, జెఎంజె సిస్టర్స్, ఉపదేశికులు పాల్గొన్నారు. పారిస్ కౌన్సిల్, విన్ ది సండే, మరియదళ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాతల సహకారంతో విద్యాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా విద్యాభివృద్ధి సాధ్య మవుతుందని హెచ్‌ఎం లూథర్‌పాల్ అన్నారు. రేమల్లె హైస్కూల్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా స్థానిక బ్రాంచ్ ద్వారా లైబ్రరీ పుస్తకాలు ఏర్పాటు చేసేందుకు ఇనుప బీరువాను శనివారం అందజేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480



కార్తికేయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

జాతీయ స్థాయి సిలంబం పోటీలకు డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థి కార్తికేయ

గుడివాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగే అఖిల భారత సిలంబం చాంపియన్‌షిప్ పోటీలకు డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థి బి.కార్తికేయ అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థిలో శనివారం కార్తికేయను, కోచ్ ఎస్.వెంకటేశ్వరరావులను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు

పంట కాల్వను పూడ్చేస్తున్న రియల్టర్

● నిబంధనలకు విరుద్ధంగా తూముల ఏర్పాటు

● సాగునీరు, మురుగు పారుదలకు ఆటంకం కలుగుతుందని రైతుల ఆందోళన

తోట్లవల్లూరు పంట కాలువను రియల్టర్ రెండడుగుల సిమెంటు తూములతో పూడ్చివేస్తుండటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువలో రెండడుగుల తూములు వరుసగా వేస్తున్నారని, తూముల్లోకి మట్టి చేరితే తొలగించేందుకు వీలుకాదని, దీంతో సాగునీరు రావాలన్నా, వర్షాకాలంలో మురుగు పోపోవాలన్నా ఆటంకం కలుగుతుందని రైతులు వాపోయారు.



పంట కాలువలో తూములపై గ్రావెల్ నింపుతున్న ఎక్స్‌కవేటర్

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ కాలనీ వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు ప్రక్కన శ్రీకర సంస్థ లే అవుట్‌లను వేసింది. ఇరిగేషన్ నిబంధనల మేరకు లే అవుట్‌లో వేసిన రోడ్డు నుంచి ఆర్ అండ్ బీ రోడ్డుపైకి వచ్చేందుకు పంట కాలువపై కల్వర్టు నిర్మించుకోవాలి. అందుకు విరుద్ధంగా రియల్టర్ రెండడుగుల సిమెంటు తూములను 200 మీటర్ల పొడవున పంట కాలువలో వరుసగా పేర్చి దా నిపై ఎక్సకవేటర్‌తో గ్రావెల్ వేసి పూడ్చివేస్తున్నాడని, ఇప్పటికే వంద మీటర్ల పొడవున తూములు వేసి పూడ్చారని పరిసర పంట పొలాల రైతులు తెలిపారు. గతంలో ఈ పంట కాలువ మూడు మీటర్ల వెడల్పు ఉండేదని రైతులు చెప్పారు. అలాంటి పంట కాలువలో రెండడుగుల తూములు వరుసగా వేస్తున్నారని, రేపు తూముల్లోకి మట్టి చేరితే తొలగించేందుకు వీలుకాదని, దీంతో సాగునీరు రావాలన్నా, వర్షాకాలంలో ము రుగు వేగంగా దిగిపోవాలన్నా ఆటంకం కలుగుతుందని రైతులంటున్నారు. రోడ్డు ఉన్నచోట కల్వర్టు నిర్మించుకుంటే అభ్యంతరం ఉండదని సూచిస్తున్నారు.

తూములు తొలగించాలని ఆదేశించాం : తహసీల్దార్

పంట కాలువలో సిమెంటు తూములు వేయటంపై తహసీల్దార్ ఎం కుసుమకుమారిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.

శ్రీకర సంస్థ ప్రతినిధులతో మా ట్లాడి తూములను తొలగించాలని ఆదేశించామని, వెంచర్‌లో రోడ్డు నుంచి మెయిన్ రోడ్డుపైకి వచ్చేందుకు కల్వర్టు నిర్మించుకోవాలని సూచించానని తెలిపారు.



రమణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యలవర్తి, రంగ ప్రసాద్, రాఘవేంద్రరావు, ఆనంద్, తిరుపతయ్య

సూరపనేని మృతి తీరని లోటు : యలవర్తి

గుడివాడ, ఫిబ్రవరి 01(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం కమిటీ జీవితకాల సభ్యుడు సూరపనేని వెంకటరమణమూర్తి మృతి తీరని లోటని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. స్టేడియం కమిటీ కార్యాలయంలో వెంకట రమణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైభారత్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్‌ను స్థాపించి వ్యవసాయ పనిముట్ల తయారీలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచారన్నారు. స్టేడియం కమిటీ సభ్యుడిగా, వీకేఆర్ వీకెఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల కమిటీ సభ్యుడిగా, ఆటోనగర్ కమిటీ సభ్యుడిగా సూరపనేని అందించిన సేవలు మరువలేనిదని కొనియాడారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు గుండిమెడ రామవేంద్రరావు, పర్వతనేని ఆనంద్, బొగ్గరపు తిరుపతయ్య, వల్లభనేని లక్ష్మీప్రసాద్, లక్ష్మణరావు, మేనేజర్ యమ్.సత్యనారాయణ, సిబ్బంది, కోచ్‌లు పాల్గొన్నారు.

ఉచిత గుండె పరీక్షలు

గుడివాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ కామినేని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ఆర్కా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బైపాస్ రోడ్డులోని ఆర్కా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత మెగా గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎం.ఎస్.ఎన్ పవన్‌కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.అజయ్‌రాజు వైద్యసేవలందించారు. సుమారు 200మంది రోగులకు ఉచితంగా షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు.

సరస్వతీ ఆలయం వార్షికోత్సవాలు రేపటి నుంచి

పమిడిముక్కల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మామిళ్లపల్లి సరస్వతీ దేవి ఆలయంలో సోమవారం నుంచి ఏడు రోజుల పాటు అమ్మవారి వార్షికోత్సవాలు అత్యం త వైభవంగా జరుగుతాయని సుజ్ఞానందగిరి మాతాజీ తెలిపారు. ప్రతియేటా మాఘ శుద్ధపంచమి రోజున ప్రారంభమయ్యే ఉత్సవాలకు జిల్లా నలుమూల నుంచి భక్తులు తరలివస్తారన్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన

గుడివాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పీజీ గ్రంథాలయంలో కేంద్ర బడ్జెట్ సమావేశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా బడ్జెట్ సమావేశాలను చూపి పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, అధ్యాపకులు వి.నాగేంద్రకుమార్, ఎం.భరత్‌కుమార్, పి.విజయకుమారి, ఎ.గ్రీష్మ పాల్గొన్నారు.



వలివర్తిపాడులో పింఛన్లు అందజేస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

పింఛన్లు 97శాతం పంపిణీ

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 97 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్ తెలిపారు. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో రూ.2.29 కోట్ల నగదు పింఛన్‌గా అందజేశామన్నారు. ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారన్నారు. ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందున ఎటువంటి రాజకీయాలకు తావు లేకుండా సిబ్బంది పింఛన్లను అందజేసినట్లు తెలిపారు.

గుడ్లవల్లేరులో 93శాతం..

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 93.76 శాతం శనివారం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో టి.విజయసారథి తెలిపారు. మండలంలో 6,997 మంది లబ్దిదారులు ఉండగా 6,571 మందికి రూ2.83 కోట్లు పంపిణీ చేశామన్నారు. అన్నిగ్రామాల్లో సంబంధిత సిబ్బంది శనివారం వేకువజాము నుంచి పింఛన్లు పంపిణీ చేశారన్నారు.



బాధిత కుటుంబాలకు వంటపాత్రలు అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

అగ్నిబాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ వితరణ

కూచిపూడి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కోసూరులో శుక్రవారం ఏడు గృహాలు దగ్ధం కాగా, 10 మంది నిరాశ్రయులయ్యారు. బాధిత కుటుంబాల కు రెడ్ క్రాస్ సంస్థ టార్పాలిన్లు, వంట పాత్రలు, రగ్గులు అందజేశారు. కూచిపూడి రోటరీక్లబ్ శాఖ దుప్పట్లు పంపిణీ చేసింది. తహసీల్దార్ కె.మస్తాన్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, జిల్లా ట్రెజరర్ కొండపల్లి బాలాజీ, మండల చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు దోనేపూడి శివరామయ్య, మద్దాల కోటేశ్వరరావు, రోటరీ ప్రతినిధు లు కోనేరు మంజునాథ్, రమేష్‌బాబు పాల్గొన్నారు.



రుద్రపాక పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నందివాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని ఎస్సై కె.శ్రీనివాస్ అన్నారు. రుద్రపాక జిల్లా పరిషత్ పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలు, వివిధ చట్టాలపై విద్యార్థులకు శనివారం ఆయన అవగాహన యువకులు వివిధ రకాల చెడు అలవాట్లకు బానిసలుగా మారి తమ జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచి మంచి అలవాట్లు అలవర్చుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అగినపర్రు జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు ఏనుగ వెంకటరమణ కుమారి

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

పమిడిముక్కల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం రుచిగా, శుభ్రతతో అందించాలని జడ్పీటీసీ సభ్యురాలు ఏనుగ వెకంటరమణ కుమారి అన్నారు. అగినపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జడ్పీటీసీ శనివారం సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి రుచిచూశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, రుచికరంగా ఉంటుందా, వంటవారు శుభ్రత పాటిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శుభ్రత పాటించి మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. వైస్ ఎంపీపీ కె మహేశ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

గుడివాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఫాదర్ బియాంకి బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 103 మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ లింగం ప్రసాద్ అందజేశారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ కంప్యూటర్స్ సహకారంతో సేవాసంఘం సభ్యులు వీటిని అందజేశారు. కె.అజయ్‌కుమార్, సత్యం, హరిబాబు, తాతారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.జయమ్మ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సత్యన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు 7 నుంచి

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ 72వ బ్రహ్మోత్సవాలు 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల బ్రోచర్లను శనివారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. చాపరాల బాలాజీ, కె.రవికుమార్, లీల, బొర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నేటి నుంచి

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సిద్ధేశ్వరస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ఉపాలయంలో సరస్వతీ అమ్మవారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, పచగవ్య ప్రాశన రుత్వికవరణ, దీక్షాధారణ, అఖండ స్థాపన, అంకురార్పణ, మండపారాధన, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠాపన దీక్షాహోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొసరాజు వెంకటాద్రి(పెదబాబు) తెలిపారు. సోమవారం ఉదయం 11.49 గంటలకు యంత్రపూర్వక మహా సరస్వతీ అమ్మవారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, అన్నసంతర్పణ జరుగుతుందన్నారు.



కాల్వ పూడికతీయిస్తున్న కార్యదర్శి నరసింహారావు

ప్రధాన కాల్వ పూడికతీత

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు రక్షిత తాగునీటి చెరువుకు నీటిని అందించే ప్రధాన కాల్వ పూడికతీత పనులు శనివారం చేపట్టారు. తాగునీటి చెరువులకు నీరు ఇవ్వనున్న క్రమంలో కాలువ పూడిక తీయించి చెరువులో తాగునీటిని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు గ్రామపంచాయితీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.

గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థి కృష్ణనిఖిల్ ప్రతిభ

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాతిగాంచిన సెమీకండక్టర్స్ తయారీ బహుళజాతి కంపెనీ టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థి జె.కృష్ణ నిఖిల్ రూ.9.20 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. ఆన్‌లైన్ రాత పరీక్షలకు 1119 మంది విద్యార్థులు రాయగా 92 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇంటర్వ్యూలో లో రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది ఎంపికాగా, జె.కృష్ణ నిఖిల్ ఒకరు కావడం అభినందనీయమన్నారు. నిఖిల్‌ను అతనికి శిక్షణ ఇచ్చిన అకాడమిక్స్ కో-ఆర్డినేటర్, ఈసీఈ విభాగాధిపతి జి.వి.వి. సత్యనారాయణ, సీనియర్ లెక్చరర్ ఎ.వి.ఎస్.ఎల్ సరోజినిలను యాజమాన్యం అభినందించింది.

మచిలీపట్నం
• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ
ఆంధ్రజ్యోతి 9
ఆదివారం
2 ఫిబ్రవరి 2025
www.andhrajyothy.com

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.480

కేంద్రం వైఖరికి ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నూరు శాతాన్ని అమలు చేస్తూ ప్రతిపాదించినందుకు ఎల్ఐసీ ఉద్యోగులు శనివారం కోనేరుసెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇన్సూరెన్స్ రంగంలో ప్రత్యక్ష పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సామాజిక బాధ్యతను ఓఎన్‌జీసీ నెరవేర్చాలి

నాగాయలంక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఓఎన్‌జీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతలను విస్మరించిందని ఏపీ సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ విమర్శించారు. ఎంపీపీ భోగాది రాఘవ రాణి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో జె.వి.సీతారామ్ కుమార్ పలు శాఖల అధికారుల పనితీరును సమీక్షించారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ మాట్లాడుతూ వక్కపట్లవారిపాలెంలో ఓఎన్‌జీసీ ఏర్పాటు చేసిన యూనిట్‌లో 2018 సంవత్సరం నుంచి సహజ వాయువును అధికారులు వెలికితీస్తున్నారని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా సమీప గ్రామాలకు రెండు శాతం నిధులను ఏటా వెచ్చించి అభివృద్ధి చేయాల్సి ఉండగా, ఇంత వరకు యాజమాన్యం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ఆయిల్ నిక్షేపాలను తరలించేందుకు వక్కపట్లవారిపాలెం గ్రామానికి భారీ వాహనాలు రావటంతో రహదారులు ధ్వంస మవుతున్నాయన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయటం లేదని తెలిపారు. పరిసర ప్రాంతాలకు ఏటా కేటాయిస్తున్న రెండు శాతం నిధులు ఏమౌతున్నాయని సర్పంచి ప్రశ్నించారు. ఓఎన్‌జీసీ యూనిట్ పరిధిలోని గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యలతో అల్లాడుతున్నారన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరగా, సమావేశానికి వచ్చిన తహసీల్దార్ ఎం. హరనాథ్ స్పందించారు. త్వరలో ఓఎన్‌జీసీ యాజమాన్యంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ హరనాథ్


నోబుల్ కళాశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీవాణి

చట్టాలపై అవగాహన ఉండాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి అన్నారు. నోబుల్ కళాశాలలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో శ్రీవాణి, రెండో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దీపిక ముఖ్యఅతిథిగా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. బీఎల్ఎస్ఏ మెంబర్, న్యాయవాది సిహెచ్. ముసలయ్య, మచిలీపట్నం ఏఎస్సై ప్రభాకర్, నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్, అధ్యాపకులు సిహెచ్. శాలిని, పాల్, సుధాకర్, కోటేశ్వరరావు, చిత్తరంజన్‌దాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్‌కు రూ.866 కోట్లు కేటాయించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ రాష్ట్ర నాయకుడు చిత్తజల్లు నాగరాము, బచ్చుల బోసుబాబు, గోకుల శివలతో పాటు టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, ఎండి ఇలియాస్ పాషా, అక్కుమహంతి రాజా, కరెడ్ల సుశీల, పివి. ఫణికుమార్, ఆళ్ళ మాధవ పాల్గొన్నారు.


డీఎస్పీ విద్యశ్రీని సత్కరిస్తున్న ఎస్‌పీఎల్ కళాశాల యాజమాన్యం

పట్టుదలతో చదవాలి : డీఎస్పీ

అవనిగడ్డ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఎస్‌పీఎల్ కళాశాలలో రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు సందేశమిచ్చారు. ఇంటర్‌లో 90 శాతం మార్కులు దాటిన విద్యార్థులకు మంచి యూనివర్సిటీలో చదువుకునే అవకాశాలు ఏర్పడతాయని, కృషి, పట్టుదలతో చదివితే దేనినైనా సాధించవచ్చునని తెలిపారు. కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎన్.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మొదటి ప్రయత్నంలో గ్రూప్-1 అధికారిగా ఎంపికైన డీఎస్పీ విద్యశ్రీని ఘనంగా సత్కరించారు.


డీఆర్కే దంపతులకు చెక్కు అందిస్తున్న ఎన్నారై దోనేపూడి శరత్

మన కోసం మనం ట్రస్ట్‌కు రూ.75 వేల విరాళం

చల్లపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా నిర్విరామం గా జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకమని ప్రవాస భారతీయుడు డాక్టర్ దోనేపూడి శరత్ అన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధన కోసం అభివృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం - మనం ట్రస్ట్‌కు శనివారం రూ.75 వేల విరాళాన్ని అందజేశారు. స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులను కలిసి చెక్కును అందించారు. ప్రజల్లో స్వచ్ఛతా స్ఫూర్తిని పెంపొందిస్తూ ఎంతో విలువైన సమయాన్ని స్వచ్ఛసేవకు అంకితం చేసిన డీఆర్కే ప్రసాద్ దంపతులకు అభినందనలు తెలిపారు.

వరసిద్ధి వినాయక స్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

చల్లపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణరావు నగర్‌లో ఆరో నెంబరు కాలువ పక్కనే నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్, దేవదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవాలు వాస్తు జ్యోతిష ఆగమ ప్రవర నల్లూరు దాశరథి శ్రీనివాస దీక్షితుల బ్రహ్మత్వంలో జరుగుతున్నాయి. శనివారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, నిత్యహోమం జరిగాయి. ప్రతిష్ఠామహోత్సవం కోసం యాగశాల నిర్మించి ఆలయాన్ని ముస్తాబు చేశారు. దేవాలయ ప్రాంగణం, కాలనీలో రహదారుల వెంబడి విద్యుద్దీపాల అలంకరణ చేశారు.

విజయ వనమలమ్మ విగ్రహాలకు ధాన్యాధివాసం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నిజాంపేటలో 106 ఏళ్ల క్రితం వెలసిన విజయ వనమలమ్మ ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రాతి స్తంభాలతో నిర్మించిన ఆలయంలో శనివారం ప్రతిష్ఠా విగ్రహాలకు ధాన్యాధివాసం చేశారు. రాళ్ళపల్లి ఆంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి గాలికి..!


వేకనూరులో ముసుగులు వేయని విగ్రహాలు, తొలగించని ఫ్లెక్సీలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినప్పటికీ అవనిగడ్డ నియోజకవర్గంలో అమలు కావటం లేదు. ముసుగులు వేయని రాజకీయ నేతల విగ్రహాలు, ఫ్లెక్సీలు కన్పిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటర్లను ప్రభావితం చేసేలా విధాన నిర్ణయాలు తీసుకోవటం, ప్రకటనలు చేయటం చేయకూడదని నిబంధనలు చెబుతున్నా గ్రామాల్లో మాత్రం వాటిని పూర్తిగా పక్కన పెట్టేశారని పలువురు ఆరోపిస్తున్నారు. వేకనూరు, తుంగలవారిపాలెం, బందలాయి చెరువు, మోదుమూడి ప్రాంతంలోని పలు విగ్రహాలు, ఫ్లెక్సీలు యథావిధిగానే కనిపిస్తుండగా, నియోజకవర్గంలోని ఇతర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

బందరులో విగ్రహాల ముఖాలకు ముసుగులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా కేంద్రం మచిలీపట్నంలో వివిధ నాయకుల విగ్రహాల ముఖాలకు ముసుగులు తొడిగారు. ఎన్టీఆర్, వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాలతో పాటు రాజీవ్‌గాంధీ, కోనేరుసెంటర్‌లోని దివంగత మాజీ ఎమ్మెల్యే పెదసింగు లక్ష్మణరావు విగ్రహాలకు ముసుగులు వేశారు.



ఆంజనేయస్వామికి వెండి తమలపాకుల దండ

పెడన, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామికి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీహరిదాసు పెద్ద కుమార్తె మాధురి, మనుమరాలు శ్లాఘన శనివారం 108 వెండి తమలపాకుల మాల సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అర్చకుడు శివకోటి కామేశ్వర శాస్త్రికి అందజేయగా, వెండి తమలపాకుల మాలను స్వామి వారికి అలంకరించారు. పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పడమట బలరామ్, కార్యదర్శి జోగి చిరంజీవి, ఉపాధ్యక్షుడు నారగాని నందా పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో అలివేలు మంగ రాజ్యలక్ష్మీ సమేత వేవేవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హిందూ చైతన్య వేదిక కార్యకర్తల సమావేశం నేడు

పెడన, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా హిందూ చైతన్య వేదిక కార్యకర్తల సమావేశం సోమవారం ఉదయం 9 గంటలకు గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు హిందూ చైతన్య వేదిక ప్రచార విభాగ్ ప్రముఖ్ కనకదుర్గ తెలిపారు. ప్రాంత, సహ, సంయోజక్ అంబటి మారుతీరాయ్ జిల్లా నూతన సంయోజక్‌ను ప్రకటిస్తారన్నారు. కార్యకర్తలు నిర్వహించాల్సిన విధులు, కార్యక్రమాలను మారుతీరాయ్ మార్గదర్శకం చేస్తారని ఆమె పేర్కొన్నారు.

యోగసాధకుల సూర్య నమస్కారాలు నేడు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ యోగసభ ఆధ్వర్యంలో మచిలీపట్నం జిల్లా పరిషత్ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 108 మంది యోగసాధకులతో 108 సార్లు సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు యోగాగురువులు ఘంటసాల గురునాథబాబు తెలిపారు. కలెక్టర్ బాలాజీ, యోగసాధకులు పాల్గొంటారన్నారు. సూర్యనమస్కారాలు చేసే వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

ఘంటసాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న పెరటి కోళ్ల పెంపకంపై ఆరురోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ తక్కువ శ్రమతో పెరటి కోళ్ల పెంపకం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. డాక్టర్ ఎస్‌వి.ఎస్.గోపాల స్వామి మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ మనోజ్, శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు రాంబాబుకు అభినందన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వి.కానూరు మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న కందిమళ్ల రాంబాబు సేవలు అభినందనీయమని టీడీపీ సీనియర్ నాయకుడు గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం వి కానూరు మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న కందిమళ్ల రాంబాబును గోపు సత్యనారాయణ శనివారం సత్కరించారు. పీతా రాము, బొమ్మిడి ఏడుకొండలు, మోపిదేవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలి

కోడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని ఎంఈవో టి.వి.ఎం.రామదాసు అన్నారు. జిల్లా సెకండరీ స్కూల్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న బాలికల ఆటల పోటీలు శనివారం ముగిశాయి. వివిధక్రీడలలో గెలుపొందిన బాలికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం నాగరత్నకుమారి,పీటీ పిడిఆర్.ప్రసాద్, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెంలో శనివారం జరిగిన గ్రిగ్ మెమోరియల్ బాలబాలికల సబ్ జోన్ ఆటల పోటీలు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సింహాద్రి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వింగ్స్ ఔట్‌రీచ్ ఫౌండేషన్ చైర్మన్ దేవా, ప్రధానోపాధ్యాయురాలు ఎం.జ్యోత్స్నదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 4, 5, 6, 7 తేదీల్లో అవనిగడ్డ మూడో వార్డులోని కోదండ రామా లయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అవనిగడ్డ మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ శనివారం తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా కోదండ రామాలయంలో మంగళవారం నుంచి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమాల కరపత్రాలను టీటీడీ జిల్లా కో-ఆర్డినేటర్ సివికె.ప్రసాద్, మోపిదేవి మండల ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి బసవ శంకరరావు ఆవిష్కరించారు.

సముద్ర తీరంలో జాగ్రత్తలు పాటించాలి

కోడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హంసలదీవి సముద్రతీరంలో జాగ్రత్తగా పాటించాలని, సముద్రంలోనికి వెళ్లరాదని మెరైన్ ఎస్సై ఉజ్వల్ తెలిపారు. హంసలదీవి బీచ్ వద్దకు వచ్చిన పర్యాటకులకు స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మెరైన్ పోలీసుల సూచనలు పాటించి స్నానాలు చేసి సురక్షితంగా తిరిగి వెళ్లాలని కోరారు. మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయాలి : తానంకి

నాగాయలంక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు...వెయ్యి గొంతులు కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ శ్రేణులు విరివిగా తరలిరావాలని తానంకి పోతురాజు కోరారు. బ్రహ్మానందపురం గ్రామంలో శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి రావాలని కోరుతూ ప్రచారం చేశారు. అనంతరం కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆరుంబాక మోహనరావు, తానంకి చంటి, తానంకి భిక్షాలరావు, కల్లేవరపు జయరావు, బందెల తిరుపతమ్మ, బందెల సన్నీ, ఆరుంబాక బాబు, దిరిశం సురేష్, తానంకి చిరంజీవి, పులివర్తి శివ, బందెల సోమేశ్వరరావు, బందెల నాంచారయ్య, కోలాటి ప్రవీణ్, జయరాజు, బందెల కృష్ణ పాల్గొన్నారు.


డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గౌతమ్

నరసాపురానికి బస్సు సౌకర్యం పునరుద్ధరించాలి

అవనిగడ్డ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గడిచిన కొంతకాలంగా నిలిపివేసిన నాగాయలంక నుంచి నరసాపురం వెళ్లే బస్సును పునరుద్ధరించాలని యువన్యాయవాది, వైసీపీ నేత బడే గౌతమ్ ఆర్టీసీ డీఎం హనుమంతరావుకు విజ్ఞప్తి చేశారు. అవనిగడ్డకు చెందిన పలువురు యువకులతో కలిసి డీఎంను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ బస్సు సర్వీసు నాగాయలంక, కోడూరు ప్రాంతాల ప్రజలకు ముఖ్యంగా మత్స్యకారులకు ఎంతో ఉపయోగంగా ఉండేదని, మంచి ఆదరణ ఉన్న ఈ బస్సును నిలిపివేస్తూ ఆర్టీసీ తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించి సర్వీసును పునరుద్ధరించాలని కోరారు.


భవిత కేంద్రానికి టేబుల్ అందజేస్తున్న రాధాకృష్ణమూర్తి

భవిత కేంద్రానికి టేబుల్, కుర్చీలు వితరణ

పెడన, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బంగ్లా స్కూల్ పరిధిలో దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి విద్యావేత్త, విశ్రాంత జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి శనివారం రూ. 12వేల విలువ గల టేబుల్, కుర్చీలు వితరణగా అందజేశారు. భవిత కేంద్రం సిబ్బంది రాధాకృష్ణమూర్తిని సత్కరించారు. ఎంఈవో -2 వై.వి. హరనాథ్, బంగ్లా స్కూల్ హెచ్ఎం జి. భాగ్యలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ సుధారాణి, వైస్‌చైర్మన్ ఎండి బాబు, సహిత విద్య ఆర్పీ ఎన్. రమ్య, సీఆర్ఎంపీలు హమీద్, హమీదుల్లా తదితరులు పాల్గొన్నారు.